సాక్షి నాగర్‌కర్నూల్

సోమవారం । 20 । నవంబర్ । 2023



.. విజేత మహబూబ్‌నగర్

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాలమూరు జట్టు విజేతగా నిలిచింది.

వివరాలు 10లో ▸



పోలీస్ వాహనం బోల్తా

పోలీసు వాహనం బోల్తా పడటంతో ముగ్గురు హోంగార్డులకు తీవ్ర గాయాలయ్యాయి.

వివరాలు 12లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.2 /21.4

ఉదయం, సాయంత్రం చలి గాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్న సమయంలో కాస్త ఎంత తీవ్రత ఉంటుంది.



కొల్లాపూర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం..



నాగర్‌కర్నూల్ సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్ అభిమానులు



నాగర్‌కర్నూల్ సభలో విజయ సంకేతం చూపుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

కాంగ్రెస్‌కు అధికారమిస్తే అంధకారమే

ప్రజా ఆశీర్వాదసభల్లో సీఎం కేసీఆర్

- హస్తం, బీజేపీలపై గులాబీబాస్ విమర్శనాస్త్రాలు
- కాంగ్రెస్ రాజ్యంలో ప్రాజెక్టులన్నీ పెండింగే..
- నేడు ఎక్కడ చూసినా వడ్ల రాశులే కనిపిస్తున్నాయ్
- గతాన్ని, ఇప్పటి తెలంగాణను పోల్చుకొని ఓటేయాలని విజ్ఞప్తి
- ఒకే రోజు నాలుగు సభల్లో ముఖ్యమంత్రి ప్రసంగం
- కార్యకర్తల్లో జోష్, భారీగా తరలివచ్చిన గులాబీ శ్రేణులు

నాగర్‌కర్నూల్/అలంపూర్/కొల్లాపూర్/కల్వకుర్తి రూరల్: కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే కరెంట్ కష్టాలు తప్పవని, సంక్షేమ పథకాల అమలు ప్రశ్నార్థకమవుతాయని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఆదివారం సీఎం కేసీఆర్ అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలపై తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఒకప్పటి తెలంగాణ, ఇప్పటి తెలంగాణ పరిస్థితులను ప్రజలకు వివరించారు. అభివృద్ధిని చూపి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. సభలకు అన్ని చోట్లా వేలాదిగా గులాబీ శ్రేణులు తరలివచ్చారు. సీఎం ప్రసంగం కార్యకర్తల్లో జోష్ నింపింది.

మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మిస్తాం..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళారీ రాజ్యం వస్తోందని సీఎం కేసీఆర్ అన్నారు. ఆ పార్టీ ఉన్నన్ని రోజులు మన బతుకులు ఏం అయ్యాయో అందరికీ తెలుసని, పేదల ఆకలి బాధలు పట్టించుకోలేదన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వాలనే సోయి లేదని, ఆగం పట్టించి బతులకు నాశనం చేశారన్నారు. ఆనాడు జరిగిన అన్యాయాలను ఒక్కొక్కటి సరిచేసుకుంటూ వస్తున్నామన్నారు. కాంగ్రెస్‌కు మరిచిపోయి ఓటేస్తే ధరణి తీసి బంగాళఖాతంలో కలుపుతామని చెబుతున్నారని విమర్శించారు. బోయలను బీసీలో పెడితే మాట్లాడలేదని, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టులను పెండింగ్ పెడితే పట్టించుకోదని ఆరోపించారు. అదే బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని మనం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపితే.. నరేంద్రమోదీ ప్రభుత్వం దాన్ని కింద పడేసి కూర్చుంది తప్ప ముందుకు కదల్చలేదన్నారు. ఈసారి కేంద్రం మెడలు వంచైనా వాల్మీకులను గిరిజనులుగా ప్రకటించే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. ఆర్డీఎస్ మీద తుమ్మిళ్ల కట్టుకున్నామని, దీని ద్వారా 30- 35 వేల ఎకరాలకు నీళ్లొస్తున్నాయన్నారు. మిగిలిన వాటికి నీళ్లందించడానికి మల్లమ్మకుంట రిజర్వాయర్ కావాలని, తప్పకుండా రిజర్వాయర్ నిర్మిస్తామని, త్వరలోనే చిన్నోనిపల్లిని పూర్తి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి పట్టుదల, నిజాయితీ గల మనిషి అని.. ప్రజలకు సేవ చేశారే తప్ప ఎవరి నుంచి ఏం ఆశించలేదన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

పదేళ్ల క్రితం ఎట్లుండె.. ఇప్పుడెట్లుందో చూడండి..



రైతులకు ప్రాజెక్టు కాల్వల ద్వారా సాగునీరందిస్తే ఏ రాష్ట్రంలో అయినా పన్నులు వసూలు చేస్తారు.. కానీ, కేఎల్ఐ ద్వారా పారే నీటికి పన్ను లేదని, పాతబకాయిలు కూడా రద్దు చేశామని ముఖ్యమంత్రి అన్నారు. కాంగ్రెస్ రాజ్యంలో పాలమూరుకు పెండింగ్ జిల్లా అనే పేరు పెట్టారని, ప్రతి ప్రాజెక్టు పెండింగ్‌లో పెట్టారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాకే అన్ని ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు అందిస్తున్నామని, ఫలితంగా ఇప్పుడు ఎక్కడ చూసినా వరికుప్పలే కనిపిస్తున్నాయని చెప్పారు. పదేళ్ల క్రితం పాలమూరు ఎట్లుండె.. ఇప్పుడెట్లుందో ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ హయాంలో పాలమూరు మంచినీటికి, సాగునీటికి, కరెంట్‌కు నోచుకోక ముంబయికి వలస పోయేవారని గుర్తుచేశారు. పాలమూరు చెంతనే కృష్ణా, తుంగభద్ర నదులు పారుతున్నా.. కనీసం మంచినీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. నిజాం కాలంలోనే నాగర్‌కర్నూల్ జిల్లాగా ఉండేదని, కాంగ్రెస్ హయాంలో ఆగం చేస్తే.. తెలంగాణ వచ్చాక మళ్లీ జిల్లా చేశామని కేసీఆర్ అన్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం మార్కండేయ లిఫ్టు మంజూరు చేశామని, నాలుగు రోజుల క్రితం నీరు కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. ఇటీవల పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పంపు ప్రారంభించామని, వట్టెం రిజర్వాయర్ పూర్తయితే మరో 40- 50 వేల ఎకరాలకు సాగునీరందుతుందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్‌లో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ ప్రభుత్వం ఏర్పడుతుందని, ఆ ప్రభుత్వమే మన తలరాత ఐదేళ్లు రాస్తుందన్నారు.

కల్వకుర్తి రైతులు సాగునీటి కష్టాలు తీరుస్తా..



కల్వకుర్తి రైతుల సాగుకష్టాలు తీర్చే బాధ్యత తనదేనని సీఎం అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ రైతుల కోసం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. కల్వకుర్తిలో ఇంజినీరింగ్ కళాశాల, ఐటీ హబ్, కొత్తమండలాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయా సభల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, చల్లా వెంకట్రామ్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, నాయకులు ఎడ్మ సత్యం, విష్ణువర్ధన్‌రెడ్డి, జక్కా రఘునందన్‌రెడ్డి, రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకట్‌రెడ్డి, కురువ విజయ్, తిరుపతమ్మగౌడ్, రఘువర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి, కిషన్‌నాయక్, బోజ్యానాయక్, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖరాచారి, జాఫర్, రుక్మద్దీన్, సురేందర్‌రావు పాల్గొన్నారు.

తెలంగాణ బతుకు పోరాటం




కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే కరెంట్ కష్టాలు తప్పవని, సంక్షేమ పథకాల అమలు ప్రశ్నార్థకమవుతాయని కేసీఆర్ అన్నారు. ఇందిరమ్మ మనవడు రాహుల్‌గాంధీ మొన్న కొల్లాపూర్‌కు ఎందుకు వచ్చిండు.. మనల్ని ఆగం పట్టించేందుక.. మళ్ల కరెంట్ బంద్ పెట్టేందుక.. మనకు ముళ్ల కిరీటం పెట్టేందుక అని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో గంజి కేంద్రాలు పెట్టేవాళ్లు. ఇప్పుడు మనమే ఇతరులకు తిండి పెట్టే స్థితికి చేరుకున్నాం. కొల్లాపూర్‌లో ఒకప్పుడు గుంపు మేస్త్రీలు ఉండే వాళ్లు.. ఇక్కడి నుంచి బొంబాయికి పనులకు వెళ్లే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు మనమే ఇతరులకు ఉపాధి కల్పిస్తున్నాం. ఇవి ఆషామాషీ ఎన్నికలు కావు.. తెలంగాణ బతుకుదెరువు పోరాటం అని.. మన బతుకు, మన తలరాత రాసే ఓట్లు ఇవి అన్నారు. హర్షవర్ధన్‌రెడ్డి ఏం పని చేసిండు.. ఇంతకు ముందున్న ఆయన ఏం పని చేసిండు.. అనేది మీకు తెల్వదా.. పోలీసోళ్లకు పట్టిచ్చుడు. కేసులు పెట్టుడు. ముఠా రాజకీయాలు కట్టుడు. కక్ష తీసుకొనుడు. ఇవి తప్ప వేరే పనేమైనా చేసిండా అని పరోక్షంగా మాజీమంత్రి జూపల్లి కృష్ణారావును విమర్శించారు. ఐదేళ్లు మంత్రిగా ఉండే అందుకే మీరు కోపంతో ఆయనను ఓడగొట్టేసింద్రు. మళ్ల ఇప్పుడు కొత్త వేషం వేసుకొని వస్తడు. మళ్ల మాట్లాడతడు. వారు ఇంతకు ముందు పెట్టిన వెలుగులేంటి.. హర్షవర్ధన్‌రెడ్డి ఖరాబ్ చేసిందేంది. ఆయనకు ఎందుకు ఎయ్యాలె ఓటు. ఓట్లు ఒట్టిగనే ఏయొద్దు. దయచేసి మీ గ్రామాల్లో చర్చించండి అని ఓటర్లను కోరారు. మీ ఎమ్మెల్యే హర్ష నన్ను అడుగుతుంటడు. కాల్వల బాగుకు, అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండని కోరుతుంటడు. సింగోటం- గోపల్‌దిన్నె లింక్ కెనాల్ పూర్తిచేస్తం. బాచారం హైలెవెల్ కెనాల్ త్వరలోనే పూర్తవుతది. మామిడి మార్కెట్‌ను పెట్టుకొని దాన్ని బ్రహ్మాండంగా ముందుకు తీసుకుపోతం. మీ ఎమ్మెల్యే మామూలోడు కాదు. బీజేపోళ్లు వచ్చి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కొందామని, వంద కోట్లకో ఎమ్మెల్యేను కొంటామని లంగ దుకాణం పెట్టింద్రు. మీ ఎమ్మెల్యే నిజాయితీగా నిలబడి ఆ దొంగలను పట్టిచ్చి జైళ్ల పెట్టిచ్చిండు. ఇంత న్యాయంగా, నిజాయితీ ఉండే మీ ఎమ్మెల్యే కొల్లాపూర్‌ల కొన్ని కాలేజీలు పెట్టిచ్చిండు. మొన్ననే కొన్ని పనులకు నిధులు ఇచ్చాం. వంద పడకల ఆస్పత్రి తెప్పిచ్చిండు. మున్సిపల్ అభివృద్ధికి రూ.25 కోట్లు ఇచ్చాం. హర్ష కోరిన మరిన్ని పనులు కూడా చేస్తాం. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించండని కోరారు.

కమలంలో ఉత్సాహం

'పాలమూరు'లో వరుసగా అగ్రనేతల పర్యటనలు



నారాయణపేట సకల జనుల సంకల్ప సభలో జనం.



నారాయణపేటలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

- మొన్న బండి సంజయ్.. నిన్న అమిత్‌షా
- జేపీ నడ్డా ప్రసంగంతో కార్యకర్తల్లో జోష్
- బీజేపీని అధికారంలోకి తీసుకురావాలన్న జాతీయ అధ్యక్షుడు

నారాయణపేట: అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో బీజేపీ అగ్రనేతలు వరుసగా ఉమ్మడి పాలమూరు జిల్లా బాట పట్టారు. జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ నామినేషన్ల సమయంలో నారాయణపేటకు వచ్చి బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఆ తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గద్వాలలో జరిగిన సభలో శనివారం పాల్గొనడంతో కార్యకర్తల్లో కదనోత్సవం కనిపిస్తోంది. ఆదివారం నారాయణపేటలో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొని ప్రసంగించడంతో బీజేపీ శ్రేణులకు మరింత ఉత్సాహం వచ్చినట్లయింది.

రూపురేఖలు మార్చే ఎన్నికలివి..

'మిత్రులారా.. మొట్టమొదటగా ఈ ప్రాంత మాతా మాణికేశ్వరి అమ్మవారికి నమస్కరిస్తున్నా.. అభ్యర్థుల పేర్లు ఏదైతే చెప్పినప్పుడు హర్షధ్వానాలతో స్వాగతించారో.. అప్పుడే పూర్తిగా నాకు నమ్మకం ఏర్పడింది. కచ్చితంగా బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తారని.. ఎమ్మెల్యేలను గెలిపించి తెలంగాణ శాసనసభకు పంపించడమే కాకుండా.. ఈ ఎన్నికలు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌తో పాటు దేశం రూపురేఖలు మార్చే ఎన్నికలివి' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనను సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజలందరూ ఒక్కసారి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ వస్తే బూడిదే..

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకరిని మించి ఒకరు మేనిఫెస్టోలను ప్రకటిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆ రెండు పార్టీలు ఏకమై డ్రామాలు చేస్తున్నాయని, కేసీఆర్ పాలనతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మనకు బూడిదే మిగులుతుందని ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్‌తోపాటు ఇక్కడ పోటీ చేసే నాయకులకు ఓటు అడిగే హక్కు లేదన్నారు.

జాయమ్మ చెరువుకు నీళ్లేవీ?

పాలమూరు- రంగారెడ్డి ద్వారా నీళ్లు తెచ్చి జాయమ్మ చెరువు నింపుతామన్న పాలకులు ఇప్పటివరకు ఎందుకు తీసుకురాలేదో చెప్పాలని మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత జితేందర్‌రెడ్డి అన్నారు. నారాయణపేట ఎప్పటికైనా బీజేపీ గడ్డ అని.. ఓడినా.. గెలిచినా రతంగ్‌పాండురెడ్డి ఎప్పుడూ ప్రజల మధ్యే ఉంటారన్నారు. కొత్తగా కాంగ్రెస్ నాయకులు వస్తున్నారు.. పెద్ద పెద్ద మాటలు చెబుతుంద్రు.. కర్ణాటకలో కాంగ్రెస్ ఐదు గ్యారంటీలు చూడండి.. ఏమైనా అమలవుతున్నాయా.. అన్నీ అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే ఐదారు లక్షల కోట్లు అప్పు చేశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఆరు గ్యారంటీలు ఎక్కడ అమలు చేస్తారో ఒక్కసారి ఆలోచించాలన్నారు. గతంలో ఎంపీగా సైనిక్ స్కూల్‌ను నారాయణపేటకు తీసుకువచ్చా.. 50 ఎకరాల ప్రభుత్వ భూమిని చూయించినా ఇప్పటి వరకు ఆ స్కూల్ ఏమైందో ఎమ్మెల్యే చెప్పాలన్నారు. ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండే రతంగ్‌పాండురెడ్డితోపాటు బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

నారాయణపేటకు జూరాల బ్యాక్‌వాటర్ ద్వారా పాలమూరు- రంగారెడ్డి నీళ్లు ఇవ్వాలని మొదటగా డిజైన్ చేసి తర్వాత డిజైన్ మార్చి నారాపూర్ దగ్గరకు తీసుకువెళ్లినా.. ఇప్పటి వరకు సాగునీరు అందలేదన్నారు. ఫలితంగా స్థానికులు బతుకుదెరువు కోసం సోలాపూర్, బొంబాయి ప్రాంతాలకు వలస పోతున్నారని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. నారాయణపేటలో రతంగ్‌పాండురెడ్డి, మక్తల్‌లో జలంధర్‌రెడ్డి, కొడంగల్‌లో బంటు రమేశ్, దేవరకద్రలో కొండా ప్రశాంత్‌రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను కోరారు.



నారాయణపేట సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాష్ట్ర నేతలు

- సాధారణ కార్యకర్త అయిన నాకు టికెట్ ఇవ్వడం అంటే అది బీజేపీ గొప్పతనం అని, కొడంగల్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు స్థానికేతరులు అయితే.. నేను లోకల్ అని కొడంగల్ బీజేపీ అభ్యర్థి బంటు రమేశ్ అన్నారు.ఈ ప్రాంతానికి సాగునీరు అందించడమే తన లక్ష్యమని, ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు.
- రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నియంత పాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో బీజేపీని ఆదరించి అధికారంలోకి తీసుకురావాలని దేవరకద్ర అభ్యర్థి కొండా ప్రశాంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఇప్పటికే రూ.5 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, మరోదిక్కు ఆరు గ్యారంటీల పేరుతో వస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్ల సకలజనులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
- రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలందరికీ ఉచిత వైద్యం, విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే అమలు చేస్తుందని మక్తల్ ఎమ్మెల్యే అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. రైతులకు వరి ధాన్యానికి క్వింటాకు మద్దతు ధర రూ.3,120 గొప్ప విషయమన్నారు.
- ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయా.. గెలిచిన అభ్యర్థి పాలన ఏ విధంగా ఉందో చూశారు.. ఈసారి తనకు ఒక్క చాన్స్ ఇచ్చి ఆశీర్వదించాలని నారాయణపేట అభ్యర్థి రతంగ్‌పాండురెడ్డి ప్రజలను కోరారు. కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటికో ఉద్యోగం, సాగునీరు, దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామంటూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు.

కార్యక్రమంలో ఓబీసీ జాతీయ అధ్యక్షులు లక్ష్మణ్, బీజేపీరాష్ట్ర నేత నాగూరావు నామాజీ, పార్లమెంట్ కన్వీనర్ పవన్‌కుమార్, జిల్లా పార్టీ అధ్యక్షులు పగడాకుల శ్రీనివాసులు, నాయకులు చంద్రశేఖర్, సత్యయాదవ్, రఘురామయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.

చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల మండపం నుంచి ఉద్దాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తున్న భక్తులు



పాదుక దర్శనం.. పాపహరణం

వైభవంగా ఉద్దాల ఉత్సవం

- మంగళహారతులతో స్వాగతం పలికిన భక్తులు
- జనసంద్రమైన ఊకచెట్టువాగు, జాతర మైదానం
- గోవిందనామస్మరణతో మార్మోగిన కురుమూర్తి గిరులు

- చిన్నచింతకుంట

వివరాలు 12లో..

చెంచుపెంటల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



అప్పాపూర్ ఆశ్రమ పాఠశాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

మన్ననూర్: చెంచుల కోసం నల్లమల అటవీ లోతట్టు ప్రాంతంలోని చెంచు పెంటల్లో 9 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అప్పాపూర్‌లో జిల్లాస్థాయి అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలలో అధికారులతో సమావేశమై పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. చెంచులకు రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రాంపూర్‌పెంట అంగన్‌వాడి కేంద్రం భవనంలో 213/అ పోలింగ్ కేంద్రంలో 46 మంది ఓటర్లు, భౌరాపూర్ అటవీశాఖ బేస్ క్యాంపు 213/ఆ పోలింగ్ కేంద్రంలో 26 మంది ఓటర్లు, ఈర్లపెంట ప్రైవేట్ భవనం 213/ఇ పోలింగ్ కేంద్రంలో 75 మంది ఓటర్లు, ఆగర్లపెంట ప్రైవేట్ భవనం 213/ఈ పోలింగ్ కేంద్రంలో 15 మంది ఓటర్లు, పుల్లాయిపల్లి ఫారెస్ట్ బేస్‌క్యాంపు 213/ఉలో 14 మంది ఓటర్లు, మేడిమల్కలో ప్రైవేట్ భవనం 213/ఊ పోలింగ్ కేంద్రంలో 45 మంది ఓటర్లు, సంఘిడిగుండాలలోని ప్రైవేట్ భవనం 213/ఎ పోలింగ్ కేంద్రంలో 22 మంది ఓటర్లు, ఫర్హాబాద్ గేట్ ఫారెస్టు బేస్‌క్యాంపు 225/అ పోలింగ్ కేంద్రంలో 10 మంది ఓటర్లు, మల్లాపూర్ 225/ఆ ప్రైవేట్ భవనం పోలింగ్ కేంద్రంలో 36 మంది ఓటర్లతో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆయా కేంద్రాలకుగాను 11 బ్యాలెట్ యూనిట్లు, 11 కంట్రోల్ యూనిట్లు, 13 వీవీ ప్యాట్లు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోదాం నుంచి ర్యాండమైజేషన్ నిర్వహించి అచ్చంపేట రిటర్నింగ్ అధికారి ఆధీనంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

మద్యం విక్రయాలపై నిఘా

నాగర్‌కర్నూల్: ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయని.. ఎక్సైజ్‌శాఖ తనిఖీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు భేరారామ్ చౌదరి ఆదేశించారు. జిల్లాలోని 67 మద్యం దుకాణాలపై పటిష్ట నిఘా ఉంచాలని, ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సర్వైవల్, టాస్క్‌ఫోర్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థుల ద్వారా మద్యం దుకాణాలకు కూపన్లు, క్రెడిట్ సందేశాలు వస్తున్నాయో గుర్తించాలన్నారు. ఎన్నికల ప్రచార రథం వాహనాలకు అయ్యే ఖర్చును తప్పనిసరిగా అభ్యర్థుల ఖర్చులో చేర్చాలని అధికారులకు సూచించారు. తిమ్మాజిపేటలోని తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ డిపో నుంచి కొల్లాపూర్ నియోజకవర్గానికి, వనపర్తి జిల్లా నుంచి సరఫరా అయ్యే డిపోలపై నిఘా ఉంచినట్లు వివరించారు.

నేటి నుంచి వృద్ధులు, దివ్యాంగుల పోలింగ్

కల్వకుర్తి రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫారం-12డి దరఖాస్తుదారులకు సోమ, మంగళవారం ఇంటి వద్దనే పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనునాయక్ తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియకు 99 మంది వృద్ధులు, దివ్యాంగుల నుంచి దరఖాస్తులు అందాయని.. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ అధికారులు ఓటర్ల ఇంటి వద్దకు ముందస్తు సమాచారం అందించి చేరుకుంటారని చెప్పారు. దరఖాస్తుదారులు మొదటిరోజు అందుబాటులో లేకుంటే రెండోరోజు మరోసారి వెళ్తారని చెప్పారు. పోలింగ్ సమయంలో అభ్యర్థి గాని, ఏజెంట్‌గాని ప్రక్రియను పరిశీలించే అవకాశం ఉందన్నారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు.

నేడు కొల్లాపూర్‌కు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాక

కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కొల్లాపూర్‌లో నిర్వహించే పరివర్తన్ సభకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం జరిగే సభలో ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారని ఆ పార్టీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు తెలిపారు.



మోసం చేయడం కంటే ఓటమి పొందడమే గౌరవదాయకమైన విషయం.
- స్వామి వివేకానంద

స్కాన్ చేయి.. వివరాలు తెలుసుకో



ఎన్నికల సంఘం ఓటరు స్లిప్పులో క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా ఓటరు వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించింది. గతంలో ఓటరు సమాచార స్లిప్పులో సదరు వ్యక్తి ఫొటోతో పాటు వివరాలు పొందుపర్చి ఉండేవి. ఈసారి సమాచార స్లిప్పులో ఓటరు ఫొటో స్థానంలో క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక స్లిప్పు వెనుక భాగంలో పోలింగ్ కేంద్రం లొకేషన్ మ్యాప్, పాటించాల్సిన నిబంధనలను తెలుగు, ఇంగ్లిష్‌లో ముద్రించారు. ప్రస్తుతం ఈ స్లిప్పులను ఓటర్ల వివరాల ఆధారంగా ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు.

- గద్వాల అర్బన్



నాగర్‌కర్నూల్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, వేదికపై బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ రాములు, మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి తదితరులు

సభలు సక్సెస్



సభలో బిత్తిరి సత్తి, శివజ్యోతి ఆటాపాట

ఎన్నికల ప్రచారంలో భాగంగా అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఆదివారం సీఎం కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు బీఆర్‌ఎస్ శ్రేణుల్లో మరింత జోష్ నింపాయి. ఆయా సభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆయా పట్టణాలు గులాబీమయంగా మారాయి. సభల్లో కళాకారుల ఆటాపాట అందరినీ అలరించాయి. నాగర్‌కర్నూల్ సభలో బిత్తిరి సత్తి, శివజ్యోతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

- సాక్షి నెట్‌వర్క్



కల్వకుర్తిలో శరీరంపై కేసీఆర్ బొమ్మ వేసుకున్న అభిమాని



నాగర్‌కర్నూల్‌లో కేరింతలు కొడుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కొల్లాపూర్ సభకు తరలివస్తున్న కార్యకర్తలు

ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు చేయాలి



ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రానికి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. అదేవిధంగా ఐటీ హబ్‌గా మార్చాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లులో ఆర్డీఓ, ఏసీపీ, సబ్ రిజిస్ట్రార్, మోటార్ వెహికిల్ అధికారి కార్యాలయాలు ఏర్పాటు చేయడంతో పాటు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలతో లక్ష 50వేల ఎకరాలకు సాగునీరు అందించాలని, కొత్త మండలాల ఏర్పాటుకు సహకరించాలని సీఎంను కోరారు.

అందరికీ అండగా ఉంటా..



నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతోనే కందనూలును సస్యశ్యామలం చేశానని పేర్కొన్నారు. కేఎల్ఐ, జిల్లా ఏర్పాటు, మెడికల్ కళాశాల, మార్కండేయ ప్రాజెక్టు వంటి హామీలు నెరవేర్చానన్నారు. మూడోసారి పార్టీ టికెట్ ఇచ్చి ప్రజల్లోకి పంపిందని, కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ప్రజలకు సేవ చేస్తానన్నారు. జిల్లాకు ఇంజినీరింగ్ కళాశాల, ఐటీ హబ్, వ్యవసాయాధారిత పరిశ్రమలు మంజూరు చేయాలని కోరగా.. సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించారు.

ప్రేమపూర్వకంగా బలపరుస్తున్నా: నాగం

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా మర్రి జనార్దన్‌రెడ్డిని ప్రేమ పూర్వకంగా బలపరుస్తున్నానని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి అని, ఇందుకు నిదర్శనమే రైతుబంధు, రైతుబీమా పథకాలు అని అన్నారు. కేసీఆర్ వచ్చాకే కరెంట్ కష్టాలు తీరాయన్నారు. ప్రతి ఒక్కరూ మర్రి జనార్దన్‌రెడ్డికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కొల్లాపూర్ సమగ్రాభివృద్ధే లక్ష్యం

కొల్లాపూర్ సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కొల్లాపూర్ అభివృద్ధికి సీఎం కేసీఆర్ అండగా ఉన్నారన్నారు. తన హయాంలో రెండేళ్లు కరోనా ఉందని, మిగిలిన మూడేళ్లలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానన్నారు. ఒక వ్యక్తి అహంకారం, కొల్లాపూర్ ప్రజల ఆత్మగౌరవానికి మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి అని అన్నారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో నాయకులను కొంటున్నారు కానీ.. మా వెంట ఉన్న ప్రజలను మీరు కొనలేరని విమర్శించారు. కొల్లాపూర్ గురించి సీఎం కేసీఆర్‌కు పూర్తిగా తెలుసని, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులు 300 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. కేసీఆర్ ఆశీర్వాదంతో కొల్లాపూర్ రూపురేఖలు మారుస్తానని, మూడో సారి కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్నారు. కొల్లాపూర్‌లో ఇంజనీరింగ్ కళాశాల, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజా ఆశీర్వాద సభల సైడ్‌లైట్స్

అలంపూర్..

- అలంపూర్ నియోజకవర్గంలోని శాంతినగర్‌లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు.
- సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ మధ్యాహ్నం 1:45 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకుంది.
- అక్కడి నుంచి ప్రత్యేక బస్సులో సీఎంతో పాటు మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఇతర ముఖ్యనాయకులు 1:50 గంటలకు సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- 1:55 గంటలకు కేసీఆర్ వేదికపైకి వచ్చి ప్రజలకు అభివాదం చేశారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడు, ఎమ్మెల్సీ చల్లా ప్రసంగం అనంతరం 2:02 గంటలకు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించి, 2:20 గంటలకు ముగించారు.
- బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.
- 2:25 గంటలకు హెలీప్యాడ్ వద్దకు చేరుకొని కొల్లాపూర్ సభకు బయల్దేరారు.
- సీఎం ప్రసంగిస్తున్న సమయంలో కొందరు ఈలలు వేయగా.. ఆయన తన ప్రసంగాన్ని ఆపి ఈలలు వేసే వారిని వారించారు.

కొల్లాపూర్..

- కొల్లాపూర్‌కు మధ్యాహ్నం 2.57 గంటలకు సీఎం కేసీఆర్ చేరుకున్నారు.
- 3:02 గంటలకు ప్రసంగం ప్రారంభించి, 3:35 గంటలకు ముగించారు.
- ఎన్నికల్లో మంది మాటలు వినొద్దని, అభివృద్ధి పనులు చేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.
- సభ ముగిశాక 12 నిమిషాల పాటు నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు.
- సభకు భారీగా జనం తరలిరావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. చాలామంది సభాప్రాంగణానికి చేరుకోలేకపోయారు.
- సీఎం మాట్లాడుతున్న సమయంలో ఇతర పార్టీలకు చెందిన ప్రచార రథాల మైకుల శబ్దాలు వినిపించాయి. దీంతో కేసీఆర్ తన ప్రసంగాన్ని ఆపి మైకుల శబ్దం ఆపాలని సూచించారు. అయినా శబ్దం ఆగకపోవడంతో అక్కడొగడు.. ఇక్కడొగడు కిరికిరి గాళ్లు ఉంటరు. వాడు పాట పెట్టుకుంటే ఏడనన్న పెట్టుకోవాలె గానీ.. మన మీటింగ్ కాడ వచ్చి పాట పెడతడా అంటూ అసహనం వ్యక్తం చేశారు. మైకుల శబ్దాలు ఆపాలని పోలీసులకు సూచించారు.

నాగర్‌కర్నూల్ ..

- నాగర్‌కర్నూల్‌కు సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ 4:05 గంటలకు చేరుకుంది.
- హెలీప్యాడ్ వద్ద ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎంపీ రాములు, జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారిలు సీఎంకు స్వాగతం పలికారు.
- 4:11 గంటలకు సభాప్రాంగణానికి చేరుకున్నారు.
- 4:31గంటలకు కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి, 4:55 గంటలకు ముగించారు. ప్రసంగిస్తున్న సమయంలో పలువురు ఈలలు వేయడంతో కేసీఆర్ అసహనం వ్యక్తం చేశారు.
- 5:03గంటలకు హెలిక్యాప్టర్‌లో కల్వకుర్తికి బయలుదేరి వెళ్లారు.
- ప్రజా ఆశీర్వాద సభలో కళాకారులు బిత్తిరి సత్తి, శివజ్యోతి పాడిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయి.
- గాయకుడు సందీప్‌రెడ్డి తన పాటలతో హోరెత్తించారు.
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మర్రి జనార్దన్‌రెడ్డిపై సీఎం కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. మర్రి జనార్దన్‌రెడ్డి ఎప్పుడూ ప్రజల్లో ఉండే నాయకుడని, సొంత డబ్బుతో సేవా కార్యక్రమాలు, ప్రతి ఏటా సామూహిక వివాహాలు చేస్తున్నారని చెప్పారు. ఆయన డబ్బు ఆశించి రాజకీయాల్లోకి రాలేదని.. అలాంటి వ్యక్తిని పెద్ద మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని అడిగారని, ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లో జీఓ ఇస్తామని హామీ ఇచ్చారు.

కల్వకుర్తి..

- కల్వకుర్తిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు జనం భారీగా తరలివచ్చారు.
- సీఎం కేసీఆర్ హెలిక్యాప్టర్ 5:12 గంటలకు కల్వకుర్తి చేరింది. సభాప్రాంగణం చుట్టూ చక్కర్లు కొట్టగా, పార్టీ కార్యకర్తలు, నాయకులు చేతులూపుతూ ఈలలు వేశారు.
- 5:18 గంటలకు కేసీఆర్ స్టేజీపైకి వచ్చారు. స్టేజీపై ఉన్న నాయకులు, ముఖ్యులకు అభివాదం చేశారు.
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ 2 నిమిషాల్లో ప్రసంగం ముగించారు.
- 5:23 గంటలకు కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి, 5:33 గంటలకు ముగించారు.
- సీఎం ప్రసంగంలో మిషన్ భగీరథ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యంల పేర్లు ప్రస్తావించగా, కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు.
- 5:42 గంటలకు కల్వకుర్తి నుంచి కేసీఆర్ బయల్దేరారు.
- సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను పొగడ్తలతో ముంచెత్తారు. జైపాల్‌యాదవ్ పట్టుదలతోనే కల్వకుర్తి ఎత్తిపోతల పథకంతో రైతులకు సాగునీరు అందుతుందన్నారు. బహుజనులందరూ అండగా నిలిచి గెలిపించుకోవాలన్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి

మక్తల్: రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన పట్టణంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని మంతన్‌గోడ్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఊట్కూర్ మండలం పెద్దపొర్లకు చెందిన నర్సింహులు, భార్య, పిల్లలతో కలిసి గ్రామానికి వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. మంతన్‌గోడ్ చెందిన కుర్వలింగప్ప (50) మక్తల్ నుంచి తన గ్రామానికి వెళ్తుండగా, మక్తల్ సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనగా లింగప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహులు తీవ్రగాయాలతో ఉండటంతో వెంటనే చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలిస్తున్న సమయంలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

కర్ణాటక రైతులను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు



కర్ణాటక రైతులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: కర్ణాటక నుంచి వస్తున్న రైతులను మహబూబ్‌నగర్ మండలం మన్యంకొండ స్టేజీ వద్ద ఆదివారం కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎన్నికల వేళ కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడానికి అక్కడి రైతులకు బీఆర్‌ఎస్ నాయకులు డబ్బు ఆశ చూపి ఇక్కడికి తీసుకొచ్చినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కర్ణాటక రైతులను అడ్డుకున్న వారిలో మాజీ సర్పంచ్ గోవిందుయాదవ్, సుధాకర్‌రెడ్డి, రవీందర్, నాయకులు ఆంజనేయులు, చిన్న అంజి ఉన్నారు.

ఎన్నికల సిత్రాలు..

బాయి హాతేన్.. ఓటు ఘాల్



కోయిలకొండ మండలం నక్కవానికుంట తండాలో నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి గిరిజనుల భాషలో 'బాయి హాతేన్ ఓట్ ఘాల్' అంటూ ఓట్లు అడగడంతో అందరూ సంబరపడ్డారు. - నారాయణపేట

విజయశంఖం 'పూరి'ద్దాం



మహబూబ్‌నగర్ మండలంలో ఎన్నికల ప్రచారం చేపట్టిన బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి.. ఓ టిఫిన్ సెంటర్‌లో పూరీలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు.

- మహబూబ్‌నగర్ రూరల్

ఓటు వేసి గెలిపించమ్మా..



బొట్టు పెట్టి అడుగుతున్నా.. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించమ్మా అంటూ మక్తల్ బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి అమరచింతలో ప్రచారం నిర్వహించారు. - అమరచింత

కుట్టు కుట్టుకూ ఓటు రావాలే..



గద్వాల బీఎస్పీ అభ్యర్థి అతికూర్ రహమాన్ కేటీదొడ్డి మండలంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ టైలరింగ్ సెంటర్‌లో కుట్టు మిషన్ తొక్కారు.

- కేటీదొడ్డి

ఫుట్‌బాల్ విజేత మహబూబ్‌నగర్ జట్టు



విజేత మహబూబ్‌నగర్ జట్టుకు బహుమతి అందజేస్తున్న కమాండెంట్ సాంబయ్య

- రన్నర్‌గా రంగారెడ్డి జట్టు

గద్వాల: జిల్లా కేంద్రంలోని స్థానిక సోమనాద్రి స్టేడియం వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన 67వ అంతర్ జిల్లాల రాష్ట్రస్థాయి అండర్–14 బాలుర ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. మహబూబ్‌నగర్ జట్టు అగ్రస్థానంలో నిలిచి టోర్నీ విజేతగా నిలిచింది. రంగారెడ్డి జట్టు రన్నర్‌గా, మూడవ స్థానాన్ని హైదరాబాద్ జట్టు నిలబెట్టుకుంది.

హోరాహోరీగా మ్యాచ్‌లు..

మొదటి సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. మహబూబ్‌నగర్ – హైదరాబాద్ జట్ల మధ్య మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ నువ్వా–నేనా అన్నట్లుగా సాగింది. చివరకు మహబూబ్‌నగర్ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. రంగారెడ్డి– నల్లగొండ జట్ల మధ్య రెండవ సెమీఫైనల్ మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరుకుంది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ రసవత్తరంగా సాగింది. ఇరుజట్ల క్రీడాకారులు ఒక వైపు క్రీడాస్ఫూర్తిని కనబరుస్తూనే మరోవైపు క్రీడాకారులు గెలుపునకు చివరిదాకా కృషి చేశారు. చివరకు మహబూబ్‌నగర్ జట్టు ఒక గోల్ సాధించి టోర్నీ విజేతగా నిలిచింది. రన్నర్‌గా రంగారెడ్డి జట్టు నిలిచింది. మూడో స్థానం కోసం హైదరాబాద్–నల్లగొండ జట్ల మధ్య మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు గెలుపొంది మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి..

క్రీడాకారులు నిర్మాణాత్మకమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలలో సత్తా చాటాలని పదవ బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక సోమనాద్రి స్టేడియంలో పోటీల ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ప్రతి ఏడాది రాష్ట్రస్థాయి పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. క్రీడల పట్టణంగా గద్వాల అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్ల క్రీడాకారులు స్ఫూర్తి దాయకమైన ఆట ద్వారా ప్రతిభ చాటారన్నారు. గెలుపొందిన విజేతలకు కమాండెంట్ మెమోంటోలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి


అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(65) మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డాకుల శివారులోని రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా కర్నూల్ వైపు వెళ్లే రోడ్డుపై హర్యానాకు చెందిన కంటెయినర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

జూరాలకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. అలాగే నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ కొనసాగుతుంది. ఆదివారం ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఆవిరి రూపంలో 90, ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 724 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,384 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.165 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నల్లగొండలో...


ముదిగొండలో...


వేములవాడలో...


ఆట చూస్తూ.. అక్షింతలు వేస్తూ..

పెళ్లి వేడుకల్లో క్రికెట్ వీక్షణానికి తెరలు

ఒకవైపు వందల సంఖ్యలో వివాహాలు. మరోవైపు ప్రపంచకప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ఆదివారం జరగడంతో అతిథుల కోసం ఎక్కడికక్కడ భారీ తెరలు ఏర్పాటు చేశారు. దీంతో వివాహాలకు హాజరైన వారు.. అటు వధూవరులను ఆశీర్వదించి.. ఇటు మ్యాచ్‌ను తిలకించారు. వేములవాడ, ముదిగొండ, నల్లగొండ ప్రాంతాల్లో జరిగిన వివిధ వివాహ వేడుకల్లో వరల్డ్‌కప్ క్రికెట్ మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు.

వేములవాడ/ముదిగొండ/నల్లగొండ



ప్రచారం మాని.. ప్రసారాలు

ఆస్ట్రేలియా – భారత్ మధ్య ఆదివారం జరిగిన క్రికెట్ ప్రపంచ కప్ పోటీ రాజకీయ పార్టీల ఎన్నికల ప్రచారానికీ తీవ్ర అంతరాయం కలిగించింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు, వారి అనుచరులు, పార్టీ శ్రేణులే కాదు.. స్వతంత్రులు సైతం ఆదివారం మధ్యాహ్నం వరకే ప్రచారం చేశారు. ఆ తర్వాత క్రికెట్ మ్యాచ్ తిలకించడంలో నిమగ్నమయ్యారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

రెండో విడత ఎంబీఏ ప్రవేశాలకు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఓయూ క్యాంపస్ కాలేజీలో ఎంబీఏ కోర్సుల్లో మిగిలిన సీట్లకు రెండో విడత ప్రవేశాలకు.. ఉద్యోగులు (ప్రభుత్వ, ప్రైవేటు) దరఖాస్తు చేసుకోవాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ పాండురంగారెడ్డి ఆదివారం తెలిపారు. ఎంబీఏ ఈవెనింగ్ (2 ఏళ్ల టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ జనరల్ (2 ఏళ్ల ఈవెనింగ్) కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు ఈనెల 22న ఉదయం 11 గంటలకు పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో ఎంట్రన్స్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9885622266 ఫోన్‌నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

పగటి పూటా ఓ కునుకేయండి



మధ్యాహ్నం వేళ 15 నుంచి 30 నిమిషాల నిద్రతో ఆరోగ్యానికి ఎంతో మేలు

- వృద్ధాప్య ఛాయలు ఏడేళ్ల వరకు తగ్గింపు
- లండన్ వర్సిటీ, ఉరుగ్వే వర్సిటీ పరిశోధనల్లో వెల్లడి
- నిద్ర లేమితో అల్జీమర్స్, చిత్త వైకల్యం వచ్చే ప్రమాదం
- అధిక నిద్రతోనూ అనారోగ్య సమస్యలు

సాక్షి, అమరావతి: చక్కటి నిద్ర దివ్యౌషధంగా పని చేస్తుంది. అందులోనూ పగటిపూట తీసే చిన్నపాటి కునుకు మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. రోజూ మధ్యాహ్నం 15–30 నిమిషాలు రెప్పవాల్చితే చిత్తవైకల్య ప్రమాదం తగ్గడంతో పాటు వృద్ధాప్య ఛాయలు త్వరగా దరిచేరవని తాజా అధ్యయనంలో వెల్లడైంది. సాధారణ వ్యక్తులతో పోలిస్తే పగటిపూట నిద్రించే వారిలో 2.6–7 సంవత్సరాల వరకు వృద్ధాప్యం నెమ్మదిస్తుంది. యూనివర్సిటీ కాలేజ్ లండన్, ఉరుగ్వేలోని యూనివర్సిటీ ఆఫ్ రిపబ్లిక్ పరిశోధకులు క్రమం తప్పకుండా పగటిపూట నిద్రపోవడం వల్ల మెదడు కుచించుకుపోయే ప్రమాదాన్ని తగ్గిస్తుందని.. చురుకుదనాన్ని ప్రేరేపిస్తుందని తేల్చారు. ఫలితంగా జ్ఞాన సామర్థ్యం, జ్ఞాపక శక్తి పెరుగుతాయని గుర్తించారు. అయితే.. పగటిపూట 90 నిమిషాల కంటే ఎక్కువసేపు నిద్రపోవడం ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి 7 గంటల నిద్ర

సంపూర్ణ ఆరోగ్యానికి సుమారు 7 గంటల మంచి నిద్రను శాస్త్రవేత్తలు, వైద్య నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. ఇందుకు విరుద్ధంగా భారత్‌లోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రపంచంలో నిద్ర లేమితో బాధపడుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నిద్ర లేకపోవడం వల్ల కలిగే సమస్య కేవలం అలసట ఒక్కటే కాదని.. తీవ్ర దీర్ఘకాలిక అనారోగ్యానికి దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. రాత్రిపూట కలతలేని నిద్రతో అలసట, తలనొప్పి, మూడ్ స్వింగ్స్ నియంత్రణలో ఉండి మానసిక ఉత్సాహంతో పని చేస్తారని చెబుతున్నారు. అయితే.. తక్కువ నిద్రపోయే వారిలో అల్జీమర్స్ వచ్చే అవకాశం 40 శాతం ఎక్కువని అధ్యయనం వెల్లడించింది.

అతి నిద్ర ప్రమాదకరం

తక్కువ నిద్రతోనే కాదు.. అతి నిద్రతోనూ ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉందని పరిశోధకులు చెబుతున్నారు. రోజంతా అదే పనిగా నిద్రపోతే అధిక రక్తపోటు, స్ట్రోక్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తేల్చారు. అతి నిద్ర అంతర్లీన నిద్ర రుగ్మతకు సంకేతమని భావిస్తున్నారు. ఈ రుగ్మతతో ఒత్తిడి, బరువును నియంత్రించే హార్మోన్లపై ప్రభావం చూపుతుందని తేల్చారు. ఫలితంగా చిన్న వయసులోనే ఊబకాయం, బీపీ, టైప్–2 డయాబెటిస్, గుండె జబ్బులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్క్రీనింగ్ సమయంతోనే ముప్పు

స్క్రీనింగ్ సమయం నిద్రలేమి స్థాయిని పెంచుతుందని అధ్యయనం చెబుతోంది. నిద్రలేమితో బాధపడే వారిలో దాదాపు 54 మంది డిజిటల్, సోషల్ మీడియాను విరివిగా వినియోగిస్తున్నట్టు గుర్తించింది. దాదాపు 87 శాతం మంది భారతీయులు పడుకునే ముందు తమ ఫోన్లను ఉపయోగిస్తుండటంతో తీవ్రమైన నిద్ర సమస్యకు దారితీస్తుందని పేర్కొంది. ఫలితంగా 56 శాతం మంది పురుషులతో పోలిస్తే 67 శాతం మంది మహిళలు పని సమయంలో నిద్రపోతున్నారని వెల్లడించింది. వీలైనంత వరకు మధ్యాహ్నం 2 గంటల లోపు కెఫిన్ ఉండే పదార్థాలను తగ్గించాలని.. మద్యం తాగి నిద్రపోవడం/నిద్రపోయే మూడు గంటల ముందు మద్యం తీసుకోవడం కూడా ఆరోగ్యానికి చేటని సూచిస్తున్నారు. ముఖ్యంగా నిద్రవేళకు దగ్గర సమయంలో వ్యాయామం చేయడం కూడా నిద్రలేమికి కారణంగా భావిస్తున్నారు.

మీరు మా హృదయాలను గెలుచుకున్నారు

- టీమిండియాపై 'ఎక్స్'లో పోస్టు చేసిన ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఫైనల్ ఫలితం నిరాశపరిచినా.. ఈ విడత వన్డే ప్రపంచ కప్‌లో భారత్ క్రీడాకారులు దేశానికి కప్ సాధించి పెట్టేందుకు మిగతా అన్ని మ్యాచ్‌లో వారు కనబరిచిన ఆట తీరు ప్రజల హృదయాలను గెలుచుకుందని ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనియాడారు. ట్విట్టర్ (ఎక్స్) ద్వారా సీఎం స్పందిస్తూ.. '2023 క్రికెట్ ప్రపంచ కప్‌లో అద్భుతమైన ప్రయాణం చేసినందుకు భారత క్రికెట్ జట్టులోని క్రీడాయోధులకు నా ప్రశంసలు. ఫైనల్ మ్యాచ్ మనకు అనుకూలంగా జరగనప్పటికీ.. ఈ ప్రయాణంలో వారి స్ఫూర్తి, క్రీడా స్ఫూర్తి, టోర్నీ మొత్తంగా వివిధ సందర్భాల్లో జట్టు సభ్యులు కనబరిచిన అద్భుతమైన ఆట తీరు యావత్ దేశానికి ఎంతో స్ఫూర్తినిచ్చాయి. టీమ్ ఇండియా! మీరు మా హృదయాలను గెలుచుకున్నారు' అంటూ ట్వీట్ చేశారు.

బీఎస్పీ అభ్యర్థి జానయ్యపై దాడికి యత్నం

- అడ్డొచ్చిన అనుచరుడికి గాయాలు.. భూ వివాదాలే కారణం
- ఆత్మకూర్–ఎస్ మండలం గట్టికల్ గ్రామంలో ఉద్రిక్తత


జానయ్య చొక్కాపై రక్తపు మరకలు


గాయపడిన జానయ్య అనుచరుడు

ఆత్మకూర్ –ఎస్(సూర్యాపేట): సూర్యాపేట నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వట్టె జానయ్య యాదవ్‌పై ఓ వ్యక్తి తన ఇద్దరు కుమారులతో కలిసి దాడికి యత్నించాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం గట్టికల్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన సామ తిరుమల్‌రెడ్డికి అదే ఊళ్లోని బండగొర్ల వెంకన్నకు కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నాయి. గతంలో వెంకన్నకు మద్దతుగా నిలిచిన జానయ్య ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి గట్టికల్ గ్రామానికి వచ్చారు. జానయ్య ప్రసంగిస్తుండగా తిరుమల్‌రెడ్డి వచ్చి దుర్భాషలాడుతూ నీ వల్ల నా భార్యాపిల్లలు ఇబ్బందులు పడ్డారంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. ప్రసంగానికి అడ్డుతగిలాడు. జానయ్య అనుచరులు, గ్రామస్తులు తిరుమల్‌రెడ్డిని ఆపే ప్రయత్నంలో ఆయన కిందపడిపోయాడు. దీంతో తీవ్ర ఆవేశంతో తిరుమల్‌రెడ్డి తన ఇంట్లోకి వెళ్లి గొడ్డలి తీసుకువచ్చాడు. ఆయన కుమారులు రాజశేఖర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి సైతం కర్రలతో వచ్చి వీరంగం సృష్టించారు. జానయ్యపై కర్రతో దాడి చేయబోగా ఆయన అనుచరుడు చింత రమేష్ అడ్డురావడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. జానయ్య అనుచరులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా అక్కడి నుంచి పరారయ్యారు. కాగా

తనపై దాడికి ప్రయత్నించిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జానయ్య తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. తిరుమల్‌రెడ్డి అతడి ఇద్దరు కుమారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

బందోబస్తుకు వెళ్లొస్తుండగా పోలీస్‌వాహనం బోల్తా



నాగర్‌కర్నూల్ క్రైం: కొల్లాపూర్‌లో ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ బందోబస్తుకు వెళ్లి వస్తున్న పోలీసు వాహనం బోల్తా పడటంతో ముగ్గురు మహిళా హోంగార్డులకు తీవ్రగాయాలయ్యాయి. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న ఆర్‌ఎస్‌ఐ శివాజీతో పాటు హోంగార్డు తిరుపతి, కొత్తకోటలో పనిచేస్తున్న హోంగార్డు జయంతి, మదనాపురంలో పనిచేస్తున్న హోంగార్డు మంజుల, మహబూబ్‌నగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో పనిచేస్తున్న హోంగార్డు అన్నపూర్ణ కొల్లాపూర్‌లో ఆదివారం బందోబస్తుకు వెళ్లారు. సభ అనంతరం తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు దేశిటిక్యాల సమీపంలో వారి వాహనం బోల్తాపడింది. జయంతి, మంజుల, అన్నపూర్ణలకు తీవ్రగాయాలయ్యాయి. హోంగార్డు తిరుపతి, ఆర్‌ఎస్‌ఐ శివాజీలకు స్వల్పగాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్ ద్వారా జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. జయంతి, మంజుల పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. జయంతి ఏడాది కూతురు కూడా పోలీసు వాహనంలో ఉన్నప్పటికీ స్వల్ప గాయాలతో బయట పడింది.

తమ్ముడిపై అన్న కత్తితో దాడి: తమ్ముడు మృతి


కుమార్ (ఫైల్)

బాలానగర్: క్షణికావేశంలో ఓ అన్న సొంత తమ్ముడిపై కత్తితో దాడి చేయగా తమ్ముడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దరేవల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని పెద్దరేవల్లికి చెందిన బైండ్ల శేఖర్‌పై రెండేళ్ల క్రితం తమ్ముడు కుమార్ (35) దాడిచేశాడని అదే కోపంతో శనివారం రాత్రి ఇరువురి మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. మళ్లీ దాడిచేస్తాడనే అనుమానంతో కూరగాయల కత్తితో తమ్ముడు కుమార్‌పై అన్న దాడి చేశాడు. తీవ్ర గాయాలు కాగా షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుని తల్లి బైండ్ల మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.


ఉద్దాల మండపం వద్ద పూజలు చేస్తున్న నెల్లి వంశస్తులు, నాయకులు


ఊకచెట్టువాగులో ఉద్దాలు చాటకింద దూరుతున్న భక్తులు


దాసంగం కుండలకు అలంకరిస్తున్న భక్తులు

వైభవం.. ఉద్దాలోత్సవం

- మంగళహారతులతో స్వాగతం పలికిన భక్తులు
- జనసంద్రంగా మారిన ఊకచెట్టువాగు, జాతర మైదానం
- గోవింద నామస్మరణతో మార్మోగిన కురుమూర్తి గిరులు


జనసంద్రంగా మారిన ఊకచెట్టువాగు

చిన్నచింతకుంట: ఉమ్మడి పాలమూరు జిల్లా వాసుల ఇంటి ఇలవేల్పుగా వెలుగొందుతున్న మండలంలోని అమ్మాపురం కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాలోత్సవం కార్తీక శుద్ధసప్తమి ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్యాల పల్లకీలో దళిత పూజారులు ఉద్దాలను తీసుకురాగా భక్తులు వాటిని తాకి పునీతులయ్యారు. దాసంగాలు పెట్టి మొక్కులు చెల్లించారు. చిన్నచింతకుంట మండలం చిన్న వడ్డేమాన్‌లోని ఉద్దాల మండపం నుంచి కురుమూర్తిస్వామి ఆలయం వరకు దారి పొడవున ఆయా గ్రామాల ప్రజలు ఉద్దాలకు మంగళహారతులతో స్వాగతం పలికారు. భక్తులు స్వామి వారి పాదుకలను దర్శించుకునేందుకు పోటీపడ్డారు.

వడ్డేమాన్ ఉద్దాల మండపం నుంచి తరలింపు

మల్లమర్రి గ్రామంలో భక్తిశ్రద్ధలతో తయారు చేసిన చాటకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్‌పై వడ్డేమాన్ ఉద్దాల మండపానికి చేర్చారు. పాదుకలను దర్శించుకునేందుకు భక్తులు మండపం వద్ద బారులు తీరారు. అప్పంపల్లి నెల్లి వంశస్తులు పాదుకలకు పూజలు చేసేందుకు మేళతాళాలతో మండపానికి చేరుకున్నారు.

ప్రముఖుల పూజలు..

పాదుకలకు ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఈఓ మదనేశ్వరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు ఆల వెంకటేశ్వరెడ్డి, మధుసూదన్‌రెడ్డి పూజలు నిర్వహించారు.

భారీ బందోబస్తు మధ్య ఊరేగింపు

పోలీసుల భారీ బందోబస్తు మధ్య దళితులు ఉద్దాలను కురుమూర్తిగిరులకు తరలించారు. ఊకచెట్టు వాగులో ఉద్దాలు చాటకింద భక్తులు దూరి పుణీతులయ్యారు. దీంతో రెండు గంటల పాటు ఊకచెట్టువాగులో తిరనాళ్లు జరిగాయి. ఊకచెట్టువాగు జనసంద్రంగా మారింది. శివసత్తుల ఆటపాటలతో గోవింద నామస్మరణ మార్మోగింది. అక్కడి నుంచి కాలిబాన తిర్మలాపూరం ఆంజనేయస్వామి ఆలయానికి చేర్చారు. గ్రామస్తులు పూజలు నిర్వహించిన అనంతరం ట్రాక్టర్‌పై కురుమూర్తి గుట్టకు తీసుకువచ్చారు. దేవుని చెరువు కట్టమీద ఉద్దాల దర్శనం కోసం భక్తులు బారులు తీరా రు. జాతర మైదానంలోని ఉద్దాల గుండు వద్ద భక్తులకు దర్శనం కల్పించి కాంచనగుహలో కురుమూర్తిస్వామి చెంతకు తీసుకెళ్లి మండపంలో ఉంచారు.


స్వామివారికి గుమ్మడికాయ సమర్పించుకుంటున్న బాలుడు

పాదయాత్రగా కర్ణాటక భక్తుడు



కర్ణాటక రాష్ట్రం యాద్గిరి జిల్లా నుంచి భక్తుడు ఆలుబాయ్ ఏడు రోజుల పాటు స్వామి వారి దీక్ష చేపట్టి కురుమూర్తి గుట్టకు పాదయాత్రగా వచ్చాడు. ఆదివారం ఉద్దాల ఉత్సవానికి కురుమూర్తి చేరుకున్నాడు. 8ఏళ్లుగా స్వామి వారి దీక్ష చేపట్టి దర్శనానికి కురుమూర్తి గిరులకు పాదయాత్రగా వస్తున్నట్లు ఆయర తెలిపారు.


కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

దారులన్నీ కురుమూర్తి వైపే..

కురుమూర్తి జాతరకు మధ్యాహ్నం నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, బైకులు, ఎడ్ల బండ్లపై భక్తులు జాతరకు చేరుకున్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, అచ్చంపేట, వనపర్తి, గద్వాల తదితర ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తుంది. దేవరకద్ర, మక్తల్, అమరచింత, కొత్తకోట, చిన్నచింతకుంట దారుల గుండా భారీ స్థాయిలో వాహనాలు వచ్చాయి.


పూనకం ఊగుతున్న భక్తుడు


ఉద్దాలును దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు..


మండపంలో ఉద్దాలు


కురుమూర్తి స్వామి దర్శనానికి భక్తుల క్యూ..


తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు


కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు